క్లుప్తంగా

నేటి నుంచి ఉచిత పశువైద్య శిబిరాలు

చీమకుర్తి రూరల్: మండలంలోని ప్రతి సచివాలయం పరిధిలో ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు రైతు సేవా కేంద్రాల వద్ద ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పల్లామల్లి పశువైద్యాధికారి డాక్టర్ టి.మనురూప్, నిప్పట్లపాడు పశువైద్యాధికారి వై.పేరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో దూడలు, గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలకు వ్యాధుల నివారణకు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. గర్భకోశ వ్యాధులకు చికిత్స, నట్టల నివారణ మందుల పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు, వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల పాడి రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీ యోగా శిక్షకునికి అవార్డు



అవార్డు పొందిన చంద్రశేఖర్

సంతనూతలపాడు: వివేకానంద అంతర్జాతీయ ప్రకృతి అకాడమీ ఆధ్వర్యంలో గ్లోబల్ భారత్ టాలెంట్ సమ్మిట్ సందర్భంగా లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డును స్థానిక ట్రిపుల్ ఐటీ కాలేజీలో యోగా శిక్షకునిగా పనిచేస్తున్న పడాల చంద్రశేఖర్‌కు సోమవారం బెంగళూరులోని యలహంక నాగార్జున డిగ్రీ కాలేజీలో అందజేశారు. సంపూర్ణ ఆరోగ్య రంగానికి తన జీవితాన్ని అంకితం చేసినందుకు అంతర్జాతీయ ప్రకృతి అకాడమీ ప్రెసిడెంట్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ను ఐఐటీ డైరెక్టర్ భాస్కర్ పటేల్, ఇతర టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ అభినందించారు.

విద్యార్థులకు పలు పోటీల నిర్వహణ



మద్దిపాడులో వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎంఈఓలు

మద్దిపాడు: విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం.శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించారు. ఈ నెల 25వ తేదీ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఓటుపై అవగాహన కల్పించే క్రమంలో కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులందరికీ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలను జిల్లా స్థాయి ఈ నెల 23న జరిగే పోటీలకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో మద్దిపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి కోటిరెడ్డి, మండలంలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అద్భుతంగా కృష్ణవేణి చరితం నృత్య రూపకం



కృష్ణవేణి చరితం నృత్య ప్రదర్శనలో చందు డ్యాన్స్ అకాడమీ విద్యార్థినులు

ఒంగోలు మెట్రో: స్థానిక పీవీఆర్ బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలలో మూడోరోజయిన సోమవారం రాత్రి వివిధ కార్యక్రమాలు జరిగాయి. ఈదర హరిబాబు అధ్యక్షతన కార్యదర్శి అన్నమనేని ప్రసాదరావు, ఇతర కమిటీ సభ్యుల సహకారంతో నిర్వహిస్తుండగా, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, తదితరులు పాల్గొన్నారు. మొక్కలు పెంచే విధానం, విత్తనాల పంపిణీ, రైతు వేషధారణ పోటీలు నిర్వహించారు. వినుకొండ, ఈదర గ్రామాల వారిచే మాస్టారు కూచి బ్రహ్మయ్య నిర్వహణలో లక్ష్మీ నారాయణ కోలాట సమాజంలోని 36 మంది కళాకారులు పాల్గొని కోలాట నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం చందు డాన్స్ అకాడమీ వారు త్రోవగుంట చందు నృత్య దర్శకత్వంలో నెమ్మాని సీతారామమూర్తి రచించిన కృష్ణవేణి చరితం ప్రదర్శన జరిగింది. కృష్ణానది మహాబలేశ్వర్‌లో పుట్టిన దగ్గర నుంచి హంసలదీవిలో సముద్రంలో కలిసే వరకు సంస్కృతి, నాగరికత, చరిత్ర మొదలైన వాటిపై కళాకారులు అద్భుతంగా నర్తించారు.

హిజ్రాలకు గుర్తింపు కార్డులు

ఒంగోలు అర్బన్: స్థానిక ప్రకాశం భవనంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఐదుగురు హిజ్రాలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా గుర్తింపు కార్డులు అందజేశారు. హిజ్రాలు, ట్రాన్స్‌జెండర్లు పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుని గుర్తింపు కార్డులు పొంది ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మద్యం విచ్చలవిడి..!



- సంతనూతలపాడు నియోజకవర్గంలో బార్లను తలపిస్తున్న వైన్ షాపులు
- నిబంధనలకు విరుద్ధంగా షాపుల వద్దే రూములు
- సమయపాలన పాటించకుండా 24 గంటలూ మద్యం అమ్మకాలు
- ఇతర రాష్ట్రాల మద్యం సైతం అమ్మకం
- మామూళ్ల మత్తులో జోగుతూ కన్నెత్తి చూడని ఎక్సైజ్ అధికారులు

సంతనూతలపాడు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మద్యం పాలసీ ద్వారా ఏర్పాటు చేసిన మద్యం షాపుల వద్ద పరిస్థితి రోజురోజుకూ దారుణంగా తయారవుతోంది. వైన్ షాపులన్నీ క్రమంగా బార్లుగా మారిపోతున్నాయి. అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూములు వెలుస్తున్నాయి. అక్కడే అన్ని రకాల స్నాక్స్, వాటర్‌తో పాటు ఫుడ్ అమ్మకాలు కూడా సాగుతున్నాయి. ఎక్సైజ్, పోలీస్ అధికారులు మామూళ్ల మత్తుకు అలవాటుపడటంతో పాటు అధికార పార్టీ ఒత్తిళ్లతో మద్యం షాపుల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని మద్యం వ్యాపారులు మరింత బరితెగించి గోవా, తెలంగాణ, హర్యానా మద్యం బాటిళ్లు సైతం తీసుకొచ్చి విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. మాచర్ల నియోజకవర్గంలో ఇతర రాష్ట్రాల మద్యం తక్కువ ధరలకు యథేచ్ఛగా లభిస్తుండటంతో అక్కడి నుంచి తెప్పించుకుని ఇక్కడ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆయా రాష్ట్రాల మద్యాన్ని ఆంధ్ర రాష్ట్రానికి చెందిన బాటిళ్లలో నింపి కొందరు విక్రయిస్తుండగా, మరికొందరు మాత్రం నేరుగానే అవే బాటిళ్లు విక్రయిస్తున్నారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు.

24/7 మద్యం విక్రయాలు...

సంతనూతలపాడు నియోజకవర్గంలోని మద్యం షాపుల్లో 24 గంటల పాటూ పగలూరాత్రీ తేడా లేకుండా యథేచ్ఛగా మద్యం విక్రయిస్తున్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే నిబంధనల ప్రకారం మద్యాన్ని దుకాణాల్లో విక్రయించాలి. కానీ, మద్యం దుకాణాల షట్టర్లు మూసి వేసి చిన్న కంత పెట్టి అందులో నుంచి రాత్రంతా మద్యం విక్రయాలకు పాల్పడుతున్నారు. మద్యం తాగి రాత్రుళ్లు మందుబాబులు చేస్తున్న గొడవలతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ తంతు యథేచ్ఛగా జరుగుతున్నా పోలీస్, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకుండా లంచాలు తీసుకుని చోద్యం చూస్తున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో మద్యం షాపుల నిర్వాహకులు దుకాణాల వద్దే గ్రీన్ మ్యాట్లు అడ్డంగా కట్టి నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్ ఏర్పాటు చేశారు. మద్యం తాగేందుకు వచ్చే వారికి అక్కడే సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. మద్యం దుకాణాల చుట్టుపక్కల రోడ్లపై ఎక్కడబడితే అక్కడ మందుబాబులు బహిరంగంగానే మద్యం తాగుతున్నారు. కూలింగ్ వాటర్ క్యాన్ల ద్వారా లూజ్ వాటర్, గ్లాసులు, స్నాక్స్‌ను మద్యం దుకాణాల వద్దే విక్రయిస్తున్నారు. దీంతో మందుబాబులు వైన్ షాపులో మద్యం కొనుగోలు చేసి అక్కడే తాగుతున్నారు.

ఒక్కో మద్యం షాపు నుంచి నెలకు రూ.50 వేల మామూళ్లు...

మద్యం వ్యాపారులంతా అధికార పార్టీకి చెందిన వారు కావడంతో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతున్నా పోలీస్, ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పనిలో పనిగా లంచాలు తీసుకుని వారి జేబులు కూడా నింపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఒక్కో మద్యం దుకాణం నుంచి నెలకు రూ.50 వేల మామూళ్లను అధికారులకు ఇస్తున్నట్లు వ్యాపారులే బహిరంగంగా చెబుతున్నారు.

గ్రామాల్లో వీధికో బెల్టు షాపు..

- సంతనూతలపాడు నియోజకవర్గంలో 300కుపైగా బెల్టు షాపులు

అసలే అధికారికంగా ఏర్పాటు చేసిన మద్యం షాపుల వద్ద పరిస్థితి దారుణంగా ఉండగా, ఇక, గ్రామాల్లో అనధికారికంగా ఏర్పాటు చేసిన బెల్టు షాపుల వద్ద పరిస్థితి చెప్పనలవి కాకుండా ఉంది. గ్రామాల్లో వీధికో బెల్టు షాపు ఏర్పాటు చేయడంతో ఊరూవాడా మద్యం ఏరులై పారుతోంది. ఎన్నికల హామీలు అమలు చేయడంలో విఫలమైన కూటమి సర్కార్.. ప్రతి ఇంటికి మద్యం సరఫరా చేస్తూ ఇళ్లు, ఒళ్లు గుల్లచేస్తోంది. సంపద సృష్టించి పథకాలు అమలుచేస్తామని ఎన్నికల ముందు పదేపదే చెప్పిన సీఎం చంద్రబాబు, కూటమి పార్టీల నేతలు అందుకు విరుద్ధంగా జనం జేబులు కొల్లగొట్టి ఖజానా నింపుకుంటున్నారన్న విమర్శలున్నాయి. బెల్టు షాపులు, మద్యం అక్రమ రవాణాను నిలువరించాల్సిన ఎక్సైజ్, పోలీస్ అధికారులు రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అడపాదడపా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయడం లేదు. దీంతో గ్రామాల్లో సైతం 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటోంది. ఉన్నతాధికారులు కూడా బెల్టు షాపులకు అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాల్లేవు. మద్యాన్ని విచ్చలవిడి చేసిన కూటమి ప్రభుత్వం ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందని మహిళలు ఆందోళన చెందుతున్నారు.

అధికారికంగా 25..
అనధికారికంగా 300కుపైనే...

సంతనూతలపాడు నియోజకవర్గంలో అధికారికంగా 25 మద్యం దుకాణాలు, ఒక బార్ అండ్ రెస్టారెంట్ ఉన్నాయి. అధిక శాతం దుకాణాలు అధికార పార్టీ నేతలవే కావడంతో ఎక్సైజ్ అధికారులను



సంతనూతలపాడులో ఓ బెల్టు షాపులో ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. తెల్లవారుజాము నుంచే వైన్ షాపులు, బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు సాగుతున్నాయి. విచ్చలవిడిగా పర్మిట్ రూంలు ఏర్పాటు చేసినా.. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు సాగించినా.. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసినా కేసులు నమోదు చేయడంతో పాటు దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని సీఎం చంద్రబాబు పైకి ప్రకటించినా.. క్షేత్రస్థాయిలో మాత్రం అమలు చేయకుండా కూటమి నేతల ఆదాయం కోసం గాలికొదిలేశారన్న విమర్శలున్నాయి. దీంతో నియోజకవర్గంలో 300 పైచిలుకు బెల్టు షాపులు వెలిసినట్లు సమాచారం. వాటిలో క్వార్టర్ బాటిల్‌కు రూ.20 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విషయంలో నిబంధనలు ఉల్లంఘించాలంటేనే భయపడే పరిస్థితి ఉండేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పరిస్థితి అందుకు భిన్నంగా మారిపోయింది. ఎక్సైజ్, పోలీస్ అధికారులు మొక్కుబడి చర్యలకే పరిమితమయ్యారన్న విమర్శలున్నాయి. అడపాదడపా బెల్టు షాపులపై దాడులు చేస్తున్నా బాటిళ్ల స్వాధీనం, నిందితుల అరెస్టుతో సరిపెట్టుకుంటున్నారు. అంతేతప్ప పట్టుబడిన మద్యం ఏ షాపు నుంచి సరఫరా చేశారనే మూలాల్లోకి వెళ్లడం లేదు. ఆయా షాపుల నుంచి మామూళ్లు తీసుకుని వాటి జోలికి వెళ్లడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చండి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: మహిళా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చినప్పుడే ఆ కుటుంబాలు ఆర్థికంగా ఎదగడంతో పాటు దేశం అభివృద్ధి చెందుతుందని స్థానిక ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ వై.మహాలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై వలంటరీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, డీఎల్‌డీఓ మహాలక్ష్మి మాట్లాడుతూ ఉల్లాస్ అనేది మంచి కార్యక్రమమని అన్నారు. గతంలో కూడా అక్షర ప్రకాశం కార్యక్రమం ఉండేదని, తద్వారా అనేకమంది మహిళలు చదువు నేర్చుకుని ఉన్నత స్థానాలకు ఎదిగారని తెలిపారు. ఎంఈఓ రవి మాట్లాడుతూ మహిళలకు చదువు ఉంటే వారి పిల్లల భవిష్యత్ చక్కగా ఉంటుందన్నారు. చదువులేని మహిళలు వయోజన విద్యాకేంద్రాల ద్వారా నేర్చుకోవాలన్నారు. ఏపీఎం నరేంద్రకుమార్ మాట్లాడుతూ వెలుగు ద్వారా నిరక్షరాస్య మహిళలను గుర్తించి వారికి మ్యాచింగ్, బ్యాచింగ్ చేయడం జరిగిందన్నారు. వారికి డ్వాక్రా గ్రూపుల నుంచి స్వచ్ఛందంగా చదువు చెప్పేందుకు ఎంపిక చేసి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం వలంటీర్ల బోధన సామగ్రితో పాటు బోధించేందుకు ఒక్కొక్కరికి 400 రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ ఉమ్మడి ప్రకాశం జిల్లా డివిజనల్ పర్యవేక్షకుడు టి.శ్రీనివాసరావు, ఏపీఓ రవిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉషారాణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దేవరపాలెంలో రీ సర్వే ప్రారంభం



వేములపాడులో మాట్లాడుతున్న ఆర్డీవో ప్రసన్నలక్ష్మి

చీమకుర్తి రూరల్: మండలంలోని దేవరపాలెం సచివాలయ పరిధిలో సోమవారం రీ సర్వేని ప్రారంభించారు. తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య, మండల సర్వేయర్ రాజేష్, గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్లు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

వేములపాడులో...

సంతనూతలపాడు: మండలంలోని వేములపాడు (మట్టిపాడు)లో సోమవారం రీ సర్వేని ఆర్డీవో ప్రసన్నలక్ష్మి ప్రారంభించారు. రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా రీ సర్వే ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఏ విధమైన తప్పులు దొర్లకుండా మందస్తుగా గ్రామంలో ర్యాలీలు, సభలు నిర్వహించామన్నారు. రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక బృందాలను నియమించి 200 నుంచి 350 ఎకరాలకు ఒక బ్లాక్‌గా విభజించామన్నారు. ఈ బ్లాకులో ఒక బృందం ఉంటుందని, ఈ బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సహాయకుడు, సాంకేతిక సిబ్బంది ఉంటారన్నారు. పొలానికి గట్ల విస్తీర్ణంపై పక్కగా కొలత వేస్తారని, గ్రామస్తులు, భూ యజమానుల సమక్షంలోనే రీ సర్వే చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఇతర రెవెన్యూ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువుల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆలూరులో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మాధవి, పశువైద్యులు రమేష్, శోభ



సర్వేరెడ్డిపాలెంలో గొర్రెలకు టీకాలు వేస్తున్న డాక్టర్ భూపాల్

కొత్తపట్నం: పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అందుకే ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని పశుసంవర్థకశాఖ ఒంగోలు డివిజన్ ఉపసంచాలకుడు డాక్టర్ ఏ.రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని ఆలూరు గ్రామంలో పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో సోమవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఆలూరు సర్పంచ్ పూనూరి మాధవి, రమేష్, అల్లూరు పశువైద్యాధికారిని డాక్టర్ వి.శోభ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఒంగోలు డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరాలలో సాధారణ వైద్య సేవలు, గర్భ కోశ వ్యాధుల నిర్ధారణ, చికిత్స, చూడి పరీక్షలు, గొంతు వాపు వ్యాధి నిరోధక టీకాలు, ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించుట, గొర్రెలకు బొబ్బ వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందన్నారు. పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 52 పశువులకు సాధారణ వైద్య సేవలు, 10 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 2 పశువులకు కృత్రిమ గర్భధారణ, 25 గేదెలు, ఆవులకు నట్టల నివారణ మందులు, 150 దూడలకు ఏలికపాము మందులు, 400 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు, 200 గొర్రెలకు బొబ్బ వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగిందన్నారు. ఇదే విధంగా ప్రతి గ్రామంలో పరీక్షలు నిర్వహించి నివారణ మందులు పంపిణీ చేస్తామన్నారు. శిక్షణ శిబిరాలకు పశుపోషకులు హాజరై పశువులకు అన్ని రకాల పరీక్షలు చేయించుకుని నివారణ మందులు తీసుకోవాలని రమేష్ కోరారు. కార్యక్రమంలో త్రోవగుంట ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ బి.బసవశంకరరావు, అల్లూరు పశువైద్యాధికారి డాక్టర్ వి.శోభ, రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

400 గొర్రెలకు టీకాలు

ఒంగోలు సిటీ: ఒంగోలు మండల పరిధిలోని సర్వేరెడ్డిపాలెంలో పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. యరజర్ల పశువైద్యాధికారి డాక్టరు వై.భూపాల్ పాల్గొని మాట్లాడారు. 400 గొర్రెలకు బొబ్బవ్యాధి నిరోధక టీకాలు, 38 పశువులకు సాధారణ వైద్య సేవలు, 23 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 165 గేదెలు, ఆవులకు నట్టల నివారణ మందులు, 35 దూడలకు ఏలికపాము మందులు, 1200 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందజేసినట్లు తెలిపారు.

మద్దిపాడు మార్కెట్ యార్డులో అక్రమాలపై ఫిర్యాదు

సంతనూతలపాడు: మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డులో అనేక అక్రమాలు జరిగాయని, వాటిపై సమగ్రమైన విచారణ జరిపించి నిజానిజాలు వెలికితీయాలని సంతనూతలపాడు గ్రామ నివాసి కుంచాల వీరబ్రహ్మయ్య తండ్రి వీరయ్య సోమవారం ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. 2015 నుంచి 2023 సంవత్సరాలకు సంబంధించి సంత ద్వారా, ఇతరముల ద్వారా దాదాపు 5 కోట్ల రూపాయల ఆదాయం రాగా, ఈ పర్మిట్ ద్వారా 49 లక్షల రూపాయల ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ మొత్తం ఆదాయాన్ని మార్కెట్ యార్డులో పనిచేసిన అధికారులు కొంతమందితో కుమ్మక్కై విచ్చలవిడిగా ఖర్చు చేశారని ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో ఖర్చు చేసిన దాదాపు 3.18 కోట్ల రూపాయలపై విచారణ చేసి ప్రభుత్వ ధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేగాకుండా సదరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలో 17 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించారని, ఆ నియామకాలు కూడా వారి ఇష్టానుసారం అమ్ముకుని ఉద్యోగాలు ఇచ్చారని ఫిర్యాదు చేశారు.

స్వచ్ఛ ఆంధ్రపై పోలీసులకు అవగాహన

చీమకుర్తి: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై చీమకుర్తి సీఐ ఎం.సుబ్బారావు సోమవారం పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించారు. చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛ ఆంధ్ర నిర్వహణకు సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు. స్టేషన్ ఆవరణ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంపై సలహాలు, సూచనలు చేశారు.

లెప్రసీపై అవగాహన కలిగి ఉండాలి

ఒంగోలు సిటీ: లెప్రసీ కేసులపై అవగాహన కలిగి ఉండాలని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టరు షేక్ సమీర్‌శర్మ సూచించారు. సోమవారం త్రోవగుంట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలోని గుడిమెళ్లపాడు సెచివాలయంలో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టరు సమీర్‌శర్మ మాట్లాడుతూ రాగిరంగు మచ్చలు, శరీరంపై స్పర్శలేని మచ్చలు, నొప్పి అనిపించని పుండ్లు మొదలగు వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మినీ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ

ఒంగోలు టౌన్: మినీ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్టేడియంలో నిర్వహించిన అసోసియేషన్ ప్రథమ సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పెసల మస్తాన్‌రావు, గౌరవ సలహాదారునిగా ఎం.విజయలక్ష్మి, ఉపాధ్యక్షునిగా ఆర్.రమాదేవి, కార్యదర్శిగా ఎస్.అప్పలరాజు, ఉప కార్యదర్శిగా కేవీవీ ప్రసాద్, కోశాధికారిగా ఎన్.రాధాకృష్ణతో పాటు ఈసీ సభ్యులుగా రాజేశ్వరరావు, ప్రభావతి, రమణారెడ్డి, ఏ జ్యోతి, బలరాంరెడ్డి, విజయలక్ష్మి ఎన్నికయ్యారు.

బూచేపల్లిని కలిసిన రాజేంద్ర



బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న రాజేంద్ర కుమార్

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం సంతనూతలపాడు నియోజకవర్గ అధ్యక్షునిగా నియమించబడిన మక్కెన రాజేంద్రకుమార్ సోమవారం చీమకుర్తిలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనను గుర్తించి పార్టీ పదవి ఇచ్చినందుకు బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డిని సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రాజేంద్రకుమార్‌ను వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మండల రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ రావి లక్ష్మయ్య, సూది శ్రీనివాసరావు, దుడ్డు మార్కు, స్థానికులు పాల్గొన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు

సంతనూతలపాడు: రాజ్యాంగ రూపకర్త భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. రాజ్యసభ సమావేశాల్లో కేంద్రమంత్రి అమిత్ షా.. అంబేడ్కర్ పట్ల చులకనగా మాట్లాడటాన్ని ఖండిస్తూ మండలంలోని బీ మాచవరంలోని కమ్యూనిటీ హాల్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ అమిత్ షా అనుకోకుండానో, పొరపాటుగానో అంబేడ్కర్‌ని అవమానించి మాట్లాడలేదని, కావాలనే మాట్లాడాడని మండిపడ్డారు. దేశం గర్వించదగిన అంబేడ్కర్ గురించి అమానుషంగా మాట్లాడిన అమిత్ షా తక్షణం రాజీనామా చేయాలని, లేదా కేంద్ర ప్రభుత్వం ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలు కేంద్ర పాలకులకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు 420 ఎంపీ స్థానాలు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని బీజేపీ ప్రకటించిందన్నారు. ప్రజలు బీజేపీ పిలుపుని తిరస్కరించారని, 60 స్థానాలకుపైగా ఓడగొట్టి బీజేపీకి బుద్ధి చెప్పారని అన్నారు. దేశంలో లౌకికతత్వం, సమానత్వం, సోదర భావం విరజిల్లాలని ప్రజలు కోరుకున్నారని, ఆ మేరకే ఎన్నికల తీర్పు ఇచ్చారని అన్నారు. రాష్ట్ర సీఎం, డిప్యూటీ సీఎంలు అమిత్ షా వ్యాఖ్యలపై స్పందించకపోవడం దుర్మార్గమని ఆయన అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు అన్నవరపు శేషారావు, అంబేడ్కర్ యూత్ నాయకులు పూరిమిట్ల వినయ్, బొమ్మతోటి బాలు, దమ్ము బన్నీ, అన్నవరపు రోహిత్, ఎ.రాము, నరేష్, శివాజీ, అభిలాష్, పూరిమిట్ల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలశాఖలో వేలం

ఒంగోలు అర్బన్: భూగర్భ జల, జల గణన శాఖ కార్యాలయంలో ఉన్న ప్రభుత్వ వాహనమైన జీపు, ఇతర పాత సామానులకు వేలం నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఉప సంచాలకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటి విలువ రూ.27,060గా నిర్ధారించామన్నారు. జీఎస్టీ అదనమని తెలిపారు. 27వ తేదీ వరకు కార్యాలయ పనిదినాల్లో రూ.300కు టెండర్ డాక్యుమెంట్ విక్రయించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గలవారు బయానాగా రూ.3 వేలు డీడీ రూపంలో టెండర్‌తో పాటు జతపరిచి గడువులోగా కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలి

సంతనూతలపాడు: మండలంలోని పిడతలగుడిపాడు గ్రామంలో సర్వే నంబర్ 325లో ఆక్రమణలు జరిగాయని, ఓ ప్రముఖ పారిశ్రామికవేత్త కంపెనీకి సంబంధించిన వారు కొనుగోలు చేసిన దానికంటే ఎక్కువ విస్తీర్ణంలో కట్టుబడి చేశారని రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య ఆరోపించారు. సోమవారం పిడతలగుడిపాడు గ్రామంలో సదరు స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆక్రమణ భూములపై తేదీ 23-12-2024న స్పందన కార్యక్రమంలో కుంచాల వీరబ్రహ్మయ్య ఫిర్యాదు చేశాడని, అంతకుముందే రాష్ట్ర మాల మహానాడు వైస్ ప్రెసిడెంట్ బత్తుల వెంకట్రావు ఫిర్యాదు చేసి ఉన్నారని తెలిపారు. కానీ, ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోలేదన్నారు. వెంటనే ఆక్రమిత భూములను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దళితులు సాగు చేసుకుంటున్న భూములను ఆక్రమించి వాగు పోరంబోకు భూములను సైతం వదలకుండా గ్రానైట్ వ్యర్థాలను వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై కొనుగోలు చేసిన భూమిని సైతం పిత్రార్జిత భూమిగా మార్చుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా తగిన చర్యలు తీసుకోవట్లేదని, కంపెనీ వారితో కుమ్మక్కై అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. దీనిపై సంతనూతలపాడు తహసీల్దార్ ఆదిలక్ష్మిని వివరణ కోరగా, సమగ్ర విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. తద్వారా ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.